క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

పిచ్చాటూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 9 గంటలకు వలంటీర్లను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సన్మానిస్తారని ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు పాల్గొనాలని ఆయన కోరారు.

నిత్యాన్నదానానికి విరాళం



చైర్మన్‌కు విరాళం ఇస్తున్న జయభారత్‌రెడ్డి కుటుంబ సభ్యులు

తొట్టంబేడు (రేణిగుంట): శ్రీకాళహస్తీశ్వర దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన దామిరెడ్డి జయభారత్‌రెడ్డి కుటుంబ సభ్యులు రూ.1.5 లక్షలను దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు విరాళంగా అందజేశారు. స్వామి, అమ్మవార్ల దర్శనానంతరం దేవస్థానం అధికారులు వారికి స్వామి, అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో పాలక మండల సభ్యులు పసల సుమతి, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం



పుర వీధుల్లో పోతురాజు ఊరేగింపు

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురంలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి ధ్వజారోహణం వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, పూజలు చేశారు. పాతవీరాపురం, ఇసుకతాగేలి, మాధవమాల, రేణిగుంట మండలంలోని దిగువమల్లవరం గ్రామాల్లో పోతురాజును ఊరేగించి పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, ఆలయ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు గురవారెడ్డి, మాజీ ఎంపీటీసీలు మునిరత్నంరెడ్డి, కోదండ రామిరెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న విద్యాకానుక పరిశీలించిన ఆర్డీఓ



విద్యాకానుకను పరిశీలిస్తున్న ఆర్డీఓ రామారావు

తొట్టంబేడు (రేణిగుంట): శ్రీకాళహస్తి పట్టణంలోని జెడ్పీ బాలుర హైస్కూలులో శుక్రవారం జగనన్న విద్యా కానుక స్టాక్ పాయింట్‌ను శ్రీకాళహస్తి ఆర్డీఓ పరిశీలించారు. యూనిఫామ్, బ్యాగులు, షూ, నోట్ బుక్స్, బెల్ట్‌లు, డిక్షనరీలను, వాటి నాణ్యతను ఆర్డీఓ కెఎస్ రామారావు పరిశీలించారు. విద్యార్థులకు సరిపడా అందుబాటులో ఉన్నాయా, లేదా? అని ఎంఈఓను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్ కుమార్, ఎంఈఓ భువనేశ్వరి, ఇరిగేషన్ ఈఈ రాఘవేంద్ర రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, సీఆర్పీలు పాల్గొన్నారు.

నివాళి



మునిరాజ యాదవ్ (ఫైల్)

వరదయ్యపాళెం: మండలంలోని మరదవాడకు చెందిన నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సేవాదళ్ కన్వీనర్ యంపళ్ల శివా యాదవ్‌కు పితృ వియోగం కలిగింది. ఆయన తండ్రి యంపళ్ల మునిరాజ యాదవ్ శుక్రవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందారు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం రాత్రి 8 గంటలకు మునిరాజ యాదవ్ మృతదేహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. శివాయాదవ్ కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నివాళులు అర్పించిన వారిలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, జేసీఎస్ కన్వీనర్ చిన్నా తదితరులు ఉన్నారు.

తిరుపతి డాక్టర్‌కు కలెక్టర్ సన్మానం



పవన్‌దత్తను సన్మానిస్తున్న కలెక్టర్

తిరుపతి అర్బన్: సివిల్స్‌లో రాష్ట్రంలో మొదటి ర్యాంక్ సాధించిన జీవీఎస్ పవన్‌దత్తను కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సత్కరించారు. తిరుపతికి చెందిన డాక్టర్ జీవీఎస్ పవన్‌దత్త 2014 బ్యాచ్‌లో డాక్టర్ పట్టాను పొందారు. అనంతరం ఆయన సివిల్స్‌పై దృష్టిసారించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఎం.శ్రీనివాసరావు, సెట్విన్ సీఈవో వి.మురళీకృష్ణ, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.ప్రవీణ్, పవన్‌దత్త తల్లిదండ్రులు లలిత కుమారి, జి.వెంకటేశ్వర్లు, కే.రాధాకృష్ణ వర్మ, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



ముసలరాజు కండ్రిగలో వృద్ధుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

సత్యవేడు: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలన చేస్తోందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. శుక్రవారం కొత్తమారికుప్పం పంచాయతీలో కొత్త కండ్రిగ, ముసలరాజు కండ్రిగ, గంగుల కండ్రిగ, ఎస్సీ కాలనీ, ఇంద్రాపురం, ఎస్టీ కాలనీ, అమాసరెడ్డి కండ్రిగ, డేగావారి కండ్రిగ, నీళ్లతొట్టి కండ్రిగలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. ఆయా కుటుంబాల్లోని వ్యక్తులు పొందిన సంక్షేమ పథకాల లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు. అర్హులైనప్పటికీ సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలు అందకపోతే తన దృష్టికి తేవాలని, వారికి అందేలా చర్యలు తీసుకుంటానన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

పంచాయతీ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్లు లోఓల్టేజీ ఉండటం మూలాన తరచూ మోటార్లు కాలిపోతున్నాయని రైతులు వాపోయారు. కంకర రోడ్డు ఆధునీకరించాలని స్థానికులు కోరారు. ఇంద్రా నగర్, ఎస్టీ కాలనీలో సిమెంటు రోడ్డు వేయాలని, మురుగు కాలువలు నిర్మించాలని, చెరువు పూడికతీత పనులు చేయాలని కోరారు. కొత్త మారికుప్పంలోని వారికి గిరిజన కాలనీ సమీపంలో ఇళ్లపట్టాలు ఇచ్చినా స్థలాలు చూపలేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్త చేశారు. సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి రైతులకు లోఓల్టేజీ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ వెంకటేష్‌ను, అలాగే లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు చూపాలని తహసీల్దార్ శ్రీదేవిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ వి.ప్రతిమ, జెడ్పీటీసీ సభ్యురాలు పి.విజయలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ కే.సుశీల్‌కుమార్ రెడ్డి, మాస్టర్ స్కూల్ చైర్మన్ కే.చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ డి.నాగమ్మ, శ్రీరాములురెడ్డి, సురుటుపల్లె ఆలయ చైర్మన్ ఏపీఎం బాలాజీ రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ బొప్పన సోమశేఖర్, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు.శ్యాంప్రసాద్ రెడ్డి, ఎంపీడీఓ రమణ కుమార్, హౌసింగ్ ఏఈ వెంకటసుబ్బయ్య, ఏపీఎం స్వర్ణలత, ఎస్ఐ పురుషోత్తం రెడ్డి, పార్టీ ముఖ్య నాయకులు గోవిందస్వామి, ఆనందరెడ్డి, మధుసూదనరావు, శ్రీనివాసులు రెడ్డి, ఏ.రవిరెడ్డి, హెచ్.గోవిందస్వామి, రూబెన్, శేఖర్, శరవణన్, మహిళా పోలీసులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం



వలంటీర్లకు సేవారత్న అవార్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

సత్యవేడు: వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ వి.ప్రతిమ అధ్యక్షతన వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. వలంటీర్లకు సేవారత్న, సేవామిత్ర పురస్కారాలను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ, వలంటీర్ వ్యవస్థతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇళ్ల ముంగిటకే పలు సేవలను అందిస్తోందన్నారు. ఫలితంగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రజలు ప్రదక్షిణలు చేసే అగత్యం తప్పిందన్నారు. ప్రభుత్వానికి మరింత మంచి పేరు తెచ్చేలా వలంటీర్లు పనిచేయాలని మార్గదర్శనం చేశారు. మండలంలోని 17 సచివాలయాల పరిధిలో 257 మంది వలంటీర్లు ఉన్నారు. వీరిలో ఐదుగురు సేవారత్న అవార్డులకు ఎంపికైన పార్థిబన్ (పెద్ద ఈటిపాకం), యమున(సత్యవేడు-3), చెంచమ్మ(సత్యవేడు-4), స్వప్న(మదనంబేడు), తిరుమల(కన్నావరం)తోపాటు 252 మంది సేవామిత్రలను శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులతోపాటు వైస్ ఎంపీపీ డి.సరోజిని, పి.వెంకటరత్నం, ఎంపీడీఓ రమణకుమార్, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ మునిరవికుమార్, సీనియర్ అసిస్టెంట్ శివయ్య రెడ్డి, ఎంఈఓ రవి, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

రూ.50 లక్షలతో సిమెంట్ రోడ్డు పనులు



సదాశివపురం వద్ద సిమెంట్ రోడ్డు వేయిస్తున్న ఆర్అండ్‌బీ అధికారులు

ఏర్పేడు: మండలంలోని సదాశివపురం వద్ద రూ.50 లక్షలతో సిమెంట్ రోడ్డు వేశారు. సదాశివపురం వద్ద రేణిగుంట, పాపానాయుడుపేట, శ్రీకాళహస్తికి వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు గుంతలమయమైంది. వర్షాకాలంలో బస్సులు, లారీలు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు, పాదచారులు, గ్రామస్తులు వెళ్లలేక ఇబ్బందులు తప్పేవి కావు. గ్రామస్తులు సమస్యను ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి విన్నవించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో ఆర్అండ్‌బీ అధికారులు రూ.50 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో 296 మీటర్ల వరకు సదాశివపురం వద్ద నూతనంగా సీసీ రోడ్డు పనులకు పూనుకున్నారు. దీనిపై హర్షం వ్యక్తం చేస్తూ గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఈఈ సుధాకర్‌రెడ్డి, డీఈ నాగమల్లయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ మురగయ్య నాయుడు పాల్గొన్నారు.

ఉయ్యాల సేవలో పద్మావతీ అమ్మవారు



నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం పద్మావతీ అమ్మవారు ఉయ్యాల సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజా కార్యక్రమాలను పూర్తి చేశారు. 7 గంటలకు వెంకన్నకు, 8 గంటలకు పద్మావతీ అమ్మవారికి శుక్రవార అభిషేకాలను నిర్వహించారు. సాయంత్రం నిత్య కైంకర్యాలను అందుకున్న అమ్మవారు తిరుచ్చి వాహనాన్ని అధిరోహించి అంతర ప్రాకారంలో విహరించిన అనంతరం ఉయ్యాలసేవలో సేదదీరారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

దాడి ఘటనలో ఆరుగురిపై కేసు

ఏర్పేడు: ఖాళీ స్థలాల వివాదం నేపథ్యంలో దాడికి పాల్పడిన ఘటనకు సంబంధించి ఆరుగురిపై కేసు నమోదు చేసినట్టు ఏర్పేడు సీఐ శ్రీహరి శుక్రవారం రాత్రి తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు.. మండలంలోని నాగంపల్లెకు చెందిన చెంగారెడ్డి(67) శుక్రవారం తమ ఇంటి వద్ద కూర్చొని ఉండగా గ్రామానికి చెందిన రోహిత్, శంకర్, లక్ష్మి, నరసయ్య, రఘురాం, యుగంధర్ దాడి చేసి గాయపరిచారు. ఈ దాడిలో చెంగారెడ్డికి గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేశారు.

నలుగురిపై కేసు నమోదు

భూతగాదాతో ఓ వ్యక్తిపై దాడిచేసిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్టు ఏర్పేడు సీఐ శ్రీహరి శుక్రవారం రాత్రి తెలిపారు. సీఐ కథనం.. నాగంపల్లెకు చెందిన మునిరెడ్డి (67)పై భూతగాదాతో గ్రామస్తులు మహానందరెడ్డి, లక్ష్మయ్య, శేషాద్రి, మణిరెడ్డి ఈనెల 7న దాడిచేసి గాయపరిచారు. అప్పట్లో పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. అనంతరం ఈనెల 25న కేసును ఉపసంహరించుకోవాలని బాధితుడిని బెదిరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదైంది.

నాగాలమ్మ ఆలయంలో పొంగళ్లు



విశేషాలంకరణలో నాగాలమ్మ

ఏర్పేడు: స్థానిక చెరువు కట్ట వద్ద ఉన్న నాగాలమ్మ ఆలయంలో శుక్రవారం వార్షిక పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు. తొలుత అమ్మవారికి అభిషేక పూజలు చేశారు. పలు ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం



తిరుమల: హైదరాబాదుకు చెందిన శ్రీనివాసులురెడ్డి టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా ఇచ్చారు. ఆయన శుక్రవారం చెక్కును తిరుమలలోని ఈవో క్యాంపు కార్యాలయంలో ఈవో ఏవీ.ధర్మారెడ్డికి అందజేశారు.

గంగమ్మకు భక్తుల పొంగళ్లు







తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో భక్తుల కోలాహలం

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మకు శుక్రవారం భక్తులు పెద్ద ఎత్తున పొంగళ్లు పెట్టారు. అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి సర్వాంగ సుందరంగా కొలువుతీర్చారు. భక్తులు కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చి పొంగళ్లు వండి అమ్మవారి కొడిస్తంభం వద్ద నైవేద్యం సమర్పించి పిండి దీపారాధన చేశారు. కొందరు భక్తులు గంగబొట్లు పెట్టుకుని వేయికళ్ల దుత్తలు, వేపాకులు చేతపట్టి ఆలయ ప్రదక్షిణ చేసి మొక్కులు తీర్చుకున్నారు.





జూన్ 2న వేదనారాయణుని కంచి గరుడ సేవ

పిచ్చాటూరు: జూన్ 2న నాగలాపురంలోని శ్రీ వేద నారాయణ స్వామి ఆలయంలో కంచి గరుడ సేవ నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. కంచిలో శ్రీ వరదరాజస్వామి ఆలయంలో గరుడ సేవను పురస్కరించుకుని నాగలాపురంలో ఈ సేవ నిర్వహించడం ఆనవాయితీ. 2న ఉదయం 6.30 నుంచి 8.30 గంటల మధ్యలో సర్వాలంకార భూషితుడైన స్వామివారు గరుడ వాహనంపై అధిష్టించి, తిరువీధుల్లో విహరిస్తూ, భక్తులకు దర్శనమిస్తారని టీటీడీ అధికారులు తెలిపారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ



అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న నాయకులు

- వైఎస్సార్ సీపీ నేత దాతృత్వం
- స్థలం కొనుగోలు చేసి భవన నిర్మాణానికి అప్పగింత

తొట్టంబేడు (రేణిగుంట): మండలంలోని పాయ్యి సచివాలయం పరిధిలోని పాయ్యి కొత్తూరులో శుక్రవారం నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణానికి ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. గతంలో అంగన్‌వాడీ భవనానికి గ్రామంలో ప్రభుత్వ స్థలం లేదు. దీంతో వైఎస్సార్ సీపీ నాయకుడు ఉన్నం వాసుదేవనాయుడు సహకారంతో రూ.3లక్షలతో గ్రామంలో స్థలాన్ని కొను గోలు చేసి, అధికారులకు అప్పగించారు. ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి సూచనలతో అధికారులు రూ.10 లక్షల నిధులు అంగన్‌వాడీ భవనానికి మంజూరు చేశారు. సొంత నిధులతో స్థలాన్ని కొనుగోలు చేసి ఇచ్చిన వాసుదేవ నాయుడును ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తరుణాక్షిరెడ్డి, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

29న మండల సమావేశం

నారాయణవనం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం 29న సోమవారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ దివాకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ గుణశేఖర్ తెలిపారు. వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు హాజరవ్వాలని ఆయన కోరారు.

వలంటీర్లకు వందనం

వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం 9 గంటలకు కమ్యూనిటీ భవనంలో మండలంలోని వలంటీర్లను సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శాలువలు కప్పి, ప్రశంసా పత్రాలను అందజేస్తారని ఎంపీడీఓ తెలిపారు.

ట్యాంకర్లతో తాగునీరు సరఫరా



ట్యాంకర్ వద్ద తాగునీటిని తీసుకువెళుతున్న గ్రామస్తులు

ఏర్పేడు: మండలంలోని సదాశివపురంలో శుక్రవారం సర్పంచ్ వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులకు ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేశారు. గురువారం మండలంలో గాలీవాన ధాటికి ట్రాన్స్‌ఫార్మర్లు, కరెంటు స్తంభాలు నేలకొరిగాయి. ఫలితంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగి గ్రామాలకు తాగునీటి సమస్య తలెత్తింది. ట్యాంకర్లతో గ్రామాలకు నీటిని సరఫరా చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల నాయకుడు కుప్పాల వెంకటేష్ పాల్గొన్నారు

ఇసుక అక్రమ రవాణా కట్టడికి చర్యలు



పులికుంద్రం వద్ద అరుణానది మార్గంలో జేసీబీతో ట్రెంచ్ కొట్టిస్తున్న పోలీసు, రెవెన్యూ అధికారులు

పిచ్చాటూరు: మండలంలో ఇసుక అక్రమ రవాణా కట్టడికి అధికారులు ఉపక్రమించారు. శుక్రవారం అరుణానది పరీవాహక ప్రాంతాల్లో పోలీసులు, రెవెన్యూ అధికారులు పర్యటించారు. నది నుంచి ట్రాక్టర్ బయటకు వచ్చేందుకు వీలుకాకుండా రోడ్డు మార్గాన్ని జేసీబీతో ట్రెంచ్ కొట్టించారు. తహసీల్దారు మధుసూదన్‌రావు మాట్లాడుతూ, మండలంలో తాము గతంలో ఇసుక రవాణాకు ఇచ్చిన అనుమతులన్నీ రద్దు చేశామని, ఇక అక్రమంగా ఇసుక తరలిస్తే వాహనాలు సీజ్ చేయాలని పోలీసులకు సూచించారు. వీఆర్‌ఓలు, పోలీసులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను చేర్పించాలని ప్రచారం



గాంధీ గిరిజన కాలనీలో బడిఈడు పిల్లలతో ఉపాధ్యాయులు

బుచ్చినాయుడుకండ్రిగ: బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని, పాఠశాలలో చదువుతూ మధ్యలో నిలిచిన పోయిన విద్యార్థులను కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో చేర్పించాలని ఉపాధ్యాయులు కరపత్ర ప్రచారం చేశారు. శుక్రవారం ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, నాదెండ్లమురళి, దాసు, గాంధీ, మొక్కలచేను గిరిజన కాలనీలో పర్యటించారు. బడిఈడు, బడి బయట పిల్లల తల్లిదండ్రులను కలిశారు. పిల్లలను పాఠశాలలో చేర్పించాలని వారిని కోరారు. వారు మాట్లాడుతూ, పాఠశాల విద్యార్థుల సంఖ్యను పెంచడమే కాక బడి బయట పిల్లలను గుర్తించి, వారందరినీ పాఠశాలలో చేర్పించేలా తల్లిదండ్రులను చైతన్యవంతుల్ని చేస్తున్నామన్నారు. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యతోపాటు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, బెల్ట్, నోట్‌బుక్స్, డిక్షనరీ, షూస్, సాక్సులు ఇవ్వడంతో పాటు రుచికరమైన పౌష్టికాహారం ప్రభుత్వం ఇస్తోందన్నారు.

తెలుగు భాష ఔన్నత్యాన్ని మరువరాదు



గ్రంథాలయంలో మాట్లాడుతున్న నారాయణ

రేణిగుంట: చిన్నతనం నుంచే తెలుగు భాష ఔన్నత్యాన్ని మరువరాదని బాలోత్సవ్ జిల్లా అధ్యక్షుడు నారాయణ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిబిరం 24వ రోజు ఆయన పాల్గొని పిల్లలను ఆటపాటలతో అలరించారు. తెలుగుభాష మధురమైనదని, భాషలు ఎన్ని నేర్చుకున్నా మాతృభాషను మరువరాదన్నారు. ప్రభుత్వం విద్యార్థుల సృజనను పెంచే రీతిలో ఇలాంటి సమ్మర్ క్యాంపులను నిర్వహించడం హర్షదాయకమన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి శ్రీముఖి, విద్యావికాస వేదిక కన్వీనర్ వెంకటరమణ పాల్గొన్నారు.

వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ.. బిజీ



కలుపు నివారణకు మందు చల్లుతున్న రైతన్న



వరిపంటను పరిశీలిస్తున్న ఏవో భారతి



వరిలో తెగుళ్ల నివారణకు మందు పిచికారీ చేస్తున్న రైతులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల, ఆర్.అనంతాపురం, ఆలత్తూరు, కాటూరు, వీయస్ పురం, జంబుగోళం గ్రామాల రైతులు వ్యవసాయ పనులలో బిజీబిజీగా ఉన్నారు. భూములను దుక్కి దున్ని వరినాట్లు నాటుతూ, ముందు నాటిన పంటలలో కలుపు తీస్తూ, పంటకు తెగుళ్లు సోకకుండా మందులను పిచికారీ చేస్తున్నారు. తెలుగు గంగ నీటిని చెరువులకు వదలడంతో పంటకు నీటికి ఇబ్బంది ఉండదనే ఆశతో రైతులు వరి పంటను విస్తారంగా సాగు చేస్తున్నారు. అలాగే మెట్ట భూముల్లో బావులు, బోర్లు వద్ద వేరుశనగ పంట వేయడానికి విత్తనాలను సిద్ధం చేసుకుంటున్నారు.